సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింది ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

ఆహ్లాదం.. ఆరోగ్యవనం



ఔషధ మొక్కల ప్రాముఖ్యత చెప్పే బోర్డు




యోగ చేసేందుకు నిర్మించిన కుటీరం

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తమ ఉద్యోగుల ఆరోగ్యం కోసం టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన ఆరోగ్యవనం వాకర్స్‌కు నిజంగా ఒక గొప్ప సౌకర్యంగా మారింది. ఈ వనంలో కలిపించిన ప్రత్యేక సదుపాయాలు ఉద్యోగుల నుంచి విశేషమైన ప్రశంసలు అందుకుంటున్నాయి. స్టీల్‌ప్లాంట్ మొదటి నుంచీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగానే ఉక్కునగరంలోని దాదాపు అన్ని సెక్టార్లలో చక్కటి పార్కులను అభివృద్ధి చేసింది. అందమైన మొక్కలతో వాటిని తీర్చిదిద్దడమే కాకుండా, వాటి నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించింది. ఈ పార్కుల్లో వాకింగ్ చేయడానికి అనువైన ఏర్పాట్లు చేయడంతో పాటు, త్రిష్టా మైదానంలో సుమారు రూ. 5 లక్షల వ్యయంతో ప్రత్యేక వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసింది.

32 రకాలు ఔషధ మొక్కలు ఏర్పాటు

పెరుగుతున్న వాతావరణ కాలుష్యం నుంచి ఉద్యోగులకు మరింత ఆరోగ్యాన్ని అందించే లక్ష్యంతో, ఆగ్రోఫారెస్ట్ విభాగం వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఒక ప్రత్యేకమైన ఆరోగ్యవనాన్ని రూపొందించింది. ఈ బహుళ ప్రయోజనకరమైన పార్క్‌లో వివిధ రకాలైన 32 ఔషధ మొక్కలను నాటడం దీని ప్రత్యేకత. వాకింగ్‌కు వచ్చే వారి ఆరోగ్యం కోసం మామిడి, నేరేడు, మారేడు వంటి విలువైన మొక్కలను ఏర్పాటు చేయడమే కాకుండా, ఒక్కో ఔషధం ఏయే వ్యాధులకు ఉపయోగపడుతుందో వివరిస్తూ నోటీస్ బోర్డులను కూడా ఉంచారు.

రెండు వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం

ఆరోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఇసుక, మట్టితో వేర్వేరుగా రెండు వాకింగ్ ట్రాక్‌లను నిర్మించారు. అంతేకాకుండా, పార్క్‌కు వచ్చే వారు యోగా లాంటి వ్యాయామాలు చేసుకోవడానికి ప్రత్యేక కుటీరాలను కూడా ఏర్పాటు చేశారు. దీని ఫలితంగా, ఉక్కునగరంలోని చాలా మంది నివాసితులు ఉదయం మరియు సాయంత్రం ఈ ఆరోగ్యవనంలో తమ వ్యాయామాలను కొనసాగిస్తున్నారు. జనరల్ షిఫ్ట్ ఉద్యోగులైతే, నేరుగా డ్యూటీ ముగించుకుని వచ్చి ఇక్కడ వాకింగ్ చేస్తున్నారు.


పార్క్‌లోని వాకింగ్ ట్రాక్

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ఈ పార్క్‌లో రాత్రిపూట సరైన లైటింగ్ లేకపోవడం ఉద్యోగులను కొంత నిరాశపరుస్తోంది. ముఖ్యంగా శీతాకాలంలో సాయంత్రం 5.30 గంటలకే చీకటి పడుతుండటంతో వాకింగ్‌కు వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిపడా వెలుతురు లేకపోవడంతో అడుగులు తడబడుతున్నాయి. దీనికి తోడు, వనంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో పాములు వంటి విష జంతువులు ఉంటాయేమోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఉక్కు ఆగ్రోఫారెస్ట్ విభాగం అధికారులు వెంటనే స్పందించి పార్క్‌లో పూర్తిస్థాయి లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అలాగే పిచ్చి మొక్కలను తొలగించి వాతావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చిన్న సమస్యలను పరిష్కరిస్తే, స్టీల్‌ప్లాంట్ ఆరోగ్యవనం నిజంగా ఉక్కు నగరవాసులకు ఒక అద్భుతమైన ఆరోగ్య కేంద్రంగా నిలుస్తుంది అనడంలో సందేహం లేదు.

ఆరోగ్యవనం చాలా ఉపయోగకరం



ఉక్కునగరవాసుల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య వనం చాలా ఉపయోగకరంగా ఉంది. అక్కడ వాకింగ్ చేయడం వల్ల మంచి వాతావరణంలో చేసిన అనుభూతి కలుగుతోంది. ఔషధ మొక్కలతో పార్కు ఏర్పాటు చేయడం బాగుంది.

– ఎస్. రమేష్‌కుమార్, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

చదలవాడకు నివాళి


చదలవాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం : ఇటీవల మృతిచెందిన చదలవాడ ప్రసాదరావుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. ప్రసాదరావు పార్టీకి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో 87 వార్డు నాయకులు బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కాంతారా వేషధారణ


కళాకారులతో బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: పాతకర్ణవానిపాలెంలో ఆరాధ్య దేవతలు శ్రీ దుర్గమాంబ, పైడిమాంబ జాతర వేడుకలు గురువారం అంబరాన్నంటాయి. గ్రామ రామాలయం వద్ద జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన కళాకారులు ప్రదర్శించిన 'కాంతారా–2' సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కాళీమాత, కాంతారా, సీతారాముల వేషధారణలు చూపరులను కట్టిపడేశాయి. వారి నృత్య ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు ప్రేక్షకులను అలరించాయి. మన సంస్కృతి సంప్రదాయాలను ఇలాంటి పండుగల సమయంలో ప్రదర్శించడం గొప్ప విషయమని కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా కళాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సిరసపల్లి అప్పారావు, గుటూరు శంకర్రావు, బొండా ఎల్లాజీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా కుంచమాంబ ఉత్సవాలు


కుంచమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

కూర్మన్నపాలెం : వడ్లపూడిలో గురువారం కుంచమాంబ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసరావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రమాదేవి, ఈశ్వరరావు, నూకరాజు, రమణమ్మ, ఆలయ కమిటీ సభ్యులు గోవింద్, కర్రి అప్పారావు, సింహాచలం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం


చిన్నారులతో డ్యాన్స్ చేయిస్తున్న గ్రంథాలయ అధికారి

అక్కిరెడ్డిపాలెం: గాజువాక శాఖ గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి చిన్నారులతో డ్యాన్సులు, కథలు చెప్పడం, చదివించడం, వాటి అర్థాలు వివరించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు వేసిన డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. పూర్వకాలంలో అమ్మమ్మలు, తాతయ్యలు చెప్పే నీతి కథల సంస్కృతి తగ్గిపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రంథాలయ అధికారి పిల్లలకు మిఠాయిలు పంచారు.

ప్రభాకర్‌రెడ్డి మృతి తీరనిలోటు


ప్రభాకర్‌రెడ్డి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తూ యూనియన్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే గొందేశి ప్రభాకర్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందడం యూనియన్‌కు తీరని లోటని ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకుడు మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్రభాకర్‌రెడ్డి పార్థివ దేహాన్ని మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు గొందేశి వెంకటరమణారెడ్డి, మద్ది శ్రీను, పిట్ట ప్రకాష్‌రెడ్డి సందర్శించి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ ఆటోనగర్ ఎయిర్ ఫీడర్, 33/11 కేవీ ఆటోనగర్ ఎస్ఎస్, 11 కేవీ శ్రీనగర్ ఫీడర్ , 33/11 కేవీ చినగంట్యాడ ఎస్ఎస్‌లలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నందున, శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్ – 2 ఈఈ బి.కె.నాయుడు గురువారం తెలిపారు. విశ్వేశ్వరయ్యనగర్, శ్రీనగర్, అఫీషియల్ కాలనీ రోడ్ నంబర్ 1, 2, 3 ప్రాంతాలు, రాఘవేంద్ర స్కూల్ ఏరియా, శ్రీరామ్‌నగర్ ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు


కబడ్డీ ఆడుతున్న చిన్నారులు

పెదగంట్యాడ: నీతి కథలు జీవితాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి తోడ్పడతాయని, చదువుతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి చూపాలని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో గురువారం చిన్నారులతో గ్రంథ పఠనం చేయించారు. అలాగే వారికి కథలు చెప్పారు. అనంతరం వారితో కబడ్డీ ఆడించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


నెల్లిముక్కు అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్

పెదగంట్యాడ: బడి ఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా బడిలో చేర్పించాలని జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ అధికారి జి. శ్రీనివాస్ అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆయన మండలంలోని నెల్లిముక్కు, గొడ్డువానిపాలెం అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, బడికి వెళ్లకుండా బయట పనుల్లో ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న అన్ని రకాల మౌలిక వసతులను వివరించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. తమ పిల్లలను పనులకు పంపకుండా బడికి పంపి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని తల్లిదండ్రులను కోరారు. ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, అంతకు మించిన వయస్సు ఉన్నవారిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం, అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఇమంది శ్రీనివాస్, కంకటాల రమణాజీ, సిబ్బంది వేణుశ్రీ, రామలక్ష్మి, ఝాన్సీరాణి, రమణ, సౌజన్య పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికునికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన నూకరాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3 విభాగంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న పిట్టా నూకరాజు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం, పిట్టవానిపాలేనికి చెందిన నూకరాజు గురువారం జనరల్ షిఫ్ట్‌లో విధులకు హాజరయ్యేందుకు బయలుదేరారు. బీఎఫ్–3 నుంచి ఎస్.ఎం.ఎస్–2కు వెళ్లే రైల్వే ట్రాక్ పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్ దాటుతుండగా అతని కాలు ట్రాక్ స్లీపర్ల మధ్యలో ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో నూకరాజు ఎడమ చేయి, ఎడమ చెవి, నడుము, మెడ భాగాలలో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న లోకో సిబ్బంది ఈ ప్రమాదాన్ని గుర్తించి వెంటనే అధికారులకు సమాచారం అందించారు. అధికారులు తక్షణమే స్పందించి నూకరాజుకు ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

డీడీ నెక్స్ట్ లెవెల్ చిత్రాన్ని నిలిపివేయాలి


సీఐ పార్థసారథికి వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: తమిళ డబ్బింగ్ సినిమా 'డీడీ నెక్స్ట్ లెవెల్'లో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి గోవింద నామాలను వక్రీకరించారని ఆరోపిస్తూ గురువా రం బీజేపీ ధార్మిక సెల్ అధ్యక్షుడు విజయ్ శంకర్ ఫణి ఆధ్వర్యంలో గాజువాక సీఎంఆర్ సెంట్రల్ మేనేజర్ వర్మను కలిసి శుక్రవారం విడుదల కానున్న ఈ చిత్రాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గాజువాక సీఐ ఎ. పార్థసారథికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విజయ్ శంకర్ ఫణి మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా 'డీడీ నెక్స్ట్ లెవెల్' సినిమాలో ఒక పాటను అర్థం మార్చి, హేళనగా డీజేతో కూడిన పాటను చిత్రీకరించారని తెలిపారు. వెంటనే సినిమా విడుదలను ఆపేయాలని డిమాండ్ చేశారు. సినిమాను ఆపకపోతే హిందువులంతా కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గాజువాక సీఐ..సీఎంఆర్ మేనేజర్ వర్మతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిమెర శ్రీనివాసరావు, కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ధార్మిక సెల్ ప్రతినిధులు అభిరామ్, శేషులత పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి


కళాకారిణి రత్నశ్రీని సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, కార్పొరేటర్ ముత్యాలు

అగనంపూడి: కళాకారులకు గుర్తింపునివ్వడంతో పాటు వారిని ప్రోత్సహించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు అన్నారు. 88వ వార్డు వెదుళ్లనరవ ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా కడప సత్యసాయి కళామండలి ఆధ్వర్యంలో భక్త చింతామణి నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా చింతామణి పాత్రధారిణి సువర్ణకు అష్టకంకణం కందుకూరి పురస్కారం, మహానటి సావిత్రి బిరుదాంకితురాలు జి. రత్నశ్రీని ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, పౌరాణిక నాటకాలు, కళాకారులు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని, వారిని ఆదుకోవడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కళాకారిణి రత్నశ్రీ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా వివిధ రాష్ట్రాల్లో మూడు వేలకు పైగా నాటకాలు ప్రదర్శించానని, చింతామణి, సత్యభామ, చంద్రమతి పాత్రల్లో నటించడంతోపాటు కొన్ని సినిమాల్లో కూడా నటించానని తెలిపారు. కళాకారులను ఈ విధంగా గుర్తించి సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్వసిద్ధి బొరయ్యనాయుడు, విందుల వరహాలు, బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, సారిపల్లి అన్నాజీరావు, పోలారావు, సీతయ్య పాల్గొన్నారు.

రమణారావు మృతి తీరనిలోటు


రమణారావు కుటంబాన్ని పరామర్శిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పొందిన పీవైపీ రమణారావు కుటుంబాన్ని రాష్ట్ర సీపీఎం కార్యదర్శి వి. శ్రీనివాసరావు పరామర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ రమణారావు క్రమశిక్షణ గల గొప్ప నాయకుడని కొనియాడారు. నిబద్ధత గల ఒక గొప్ప నాయకుడిని సీపీఎం కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం. రాంబాబు, జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

యాపిల్ ఐ స్కూల్‌లో శతశాతం ఉత్తీర్ణత

కూర్మన్నపాలెం : శ్రీనగర్‌లోని యాపిల్ ఐ ఇంగ్లిష్ మీడియం స్కూలు పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది. సీబీఎస్ఈ సిలబస్‌లో పదో తరగతి పరీక్షలకు 88 మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ పాసయ్యారు. అలాగే 12వ తరగతికి హాజరైన 24 మంది విద్యార్థులు కూడా శతశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చారని ప్రిన్సిపాల్ జయ శ్రీ శర్మ తెలిపారు. ఈ విజయం పట్ల పాఠశాల డైరెక్టర్ బలరాం కృష్ణ ఉపాధ్యాయులను అభినందించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం దృష్టికి దువ్వాడ రైల్వే సమస్యలు


డీఆర్‌ఎంకు వినతిపత్రం అందిస్తున్న తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు, సౌకర్యాలు ఇతర వసతులను స్వయంగా పరిశీలించేందుకు దువ్వాడ రైల్వేస్టేషన్‌ను సందర్శించాలని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) లలిత్ బొహ్రాను తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ కోరారు. డీఆర్‌ఎం కార్యాలయంలో లలిత్ బొహ్రాను కలిసి పలు సమస్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. వాల్తేరు–సికింద్రాబాద్‌ల మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడ రైల్వే స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని, అదేవిధంగా వందే భారత్ రైళ్లలో స్లీపర్ క్లాస్ కోచ్‌లు ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, విశాఖ నుంచి కొల్లాం, షిర్డీ, గాంధీధామ్, వారణాసి, చెన్నైలకు వారాంతపు ప్రత్యేక రైళ్లను ప్రతిరోజు నడపాలని, ప్రస్తుతం విశాఖ–తిరుపతిల మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లో కేవలం 11 కోచ్‌లు మాత్రమే ఉన్నందున, థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ అదనపు కోచ్‌లు ఏర్పాటు చేయాలని ఆయన డీఆర్‌ఎం బొహ్రాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్, బి. వెంకట్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి


కొత్తగాజువాక కూడలిలో సమ్మె ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జాతీయ కార్మిక సంఘాలు మే 20న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం కొత్త గాజువాక కూడలిలో కార్మిక సంఘాల నాయకులతో కలిసి సమ్మె ప్రచారాన్ని నిర్వహించారు. జరగనున్న సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పెదపూడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- వైభవంగా నిత్యకల్యాణం


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు.

భవనం పై నుంచి దూకేస్తానని వ్యక్తి హల్‌చల్

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో గురువారం సాయంత్రం మతిస్థిమితం లేని ఒక వ్యక్తి ఎత్తైన భవనం పైకి ఎక్కి దూకేస్తానని హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులు దువ్వాడ పోలీసులకు, పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. ఆ వ్యక్తిని కాపాడేందుకు ఎవరైనా దగ్గరకు వెళ్లబోతే తన వద్ద ఉన్న కర్రతో కొట్టడానికి ప్రయత్నించడంతో స్థానికులు భయపడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న దువ్వాడ పోలీసులు, ఫైర్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి ఆ వ్యక్తిని భవనం పై నుంచి కిందకు దించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. విచారణలో ఆ వ్యక్తికి మతిస్థిమితం సరిగా లేదని తేలింది. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా రతన్‌పూర్ సమీపంలోని టిగర్‌పడా గ్రామానికి చెందిన ఒండాలి శ్యామ్ సుందర్ అని పోలీసులు గుర్తించారు. శ్యామ్ సుందర్ ఎవరికీ చెప్పకుండా రైలు ఎక్కి ఇక్కడికి వచ్చినట్లు పోలీసులు భావిస్తున్నారు. భవనం పై నుంచి దూకడానికి ప్రయత్నించినందువల్ల శ్యామ్ సుందర్‌కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స కోసం అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. శ్యామ్ సుందర్ చెప్పిన వివరాలను నమోదు చేసుకున్న పోలీసులు అతడిని తన కుటుంబ సభ్యుల వద్దకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గాజువాక

9912222749, 9705347420, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com